క్లుప్తంగా

మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలు



పినతాడివాడ రామాలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్సై సన్యాసినాయుడు, తదితరులు

డెంకాడ: మండల వ్యాప్తంగా ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. పినతాడివాడ రామాలయం, సాయిబాబా ఆలయం వద్ద రెండు సీసీ కెమెరాలు బుధవారం ఏర్పాటు చేశారు. అలాగే గెద్దవానిపాలెం ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద రెండు, డి.తాళ్లవలస బంగారమ్మ ఆలయం, సాయిబాబా మందిరం వద్ద కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేర పరిశోధనకు కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు



ఆక్రమిత భూమిలో ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

విజయనగరం: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని డబుల్స్ కాలనీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆక్రమణదారులను గుర్తించి, బుధవారం హద్దులు తొలగించారు. ఆక్రమణదారులపై చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



నీటి పరీక్షలు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ధ్యేయంగా నిరంతర నీటి పరీక్షలు చేపడుతున్నట్లు కార్పొరేషన్ ఈఈ టి. రాయల్‌బాబు తెలిపారు. నగరంలో ఉన్న అన్ని వాటర్ ట్యాంకులను బుధవారం శుభ్రం చేశారు. అలాగే కుళాయిల ద్వారా వచ్చే నీటికి నాణ్యత పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రాయల్‌బాబు మాట్లాడుతూ.. నగర ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడడం ఎంత ప్రధానమో.. సురక్షితమైన నీటిని అందించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ఇందుకోసం ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు చెఆప్పరు.

త్వరితగతిన నిర్మాణాలు



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఆయన చాంబర్‌లో డీఈలతో బుధవారం సమావేశమయ్యారు. ముఖ్యంగా నగరంలో పాడైన ఫౌంటైన్‌లను సరి చేయాలని సూచించారు. అలాగే ఎప్పటికప్పుడు వీధిదీపాల నిర్వహణపై నివేదికలు సమర్పించాలన్నారు. వాటర్ ట్యాంకులను తరచూ పరిశుభ్రపరిచే విధంగా సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో డీఈలు ప్రసాద్, శ్రీనివాసరావు, మణికుమార్ పాల్గొన్నారు.

13న అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె. ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 13న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్ష ఉంటుందని.. బ్లూ, బ్లాక్ పెన్నులతో వృత్తాలను నింపాల్సి ఉంటుందని చెప్పారు. ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..ప్రథమ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు పరీక్ష ఉంటుందన్నారు.

పింఛన్ల మంజూరులో తాత్సారం..



- అర్హత ఉన్నా అందని పింఛన్లు
- దరఖాస్తు చేసుకోవడానికి తెరుచుకోని వెబ్‌సైట్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు



కొప్పెర్ల సచివాలయం

పూసపాటిరేగ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా కొత్త పింఛన్ ఒక్కటి కూడా మంజూరు కాలేదు. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు కనీసం వెబ్‌సైట్ కూడా తెరుచుకోని పరిస్థితి నెలకొంది. దీంతో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోజుల వ్యవధిలో పెన్షన్లు మంజూరయ్యేవి. ముఖ్యంగా వితంతు పింఛన్లు అయితే భర్త చనిపోయిన వెంటనే డెత్ సర్టిఫికెట్ సచివాలయంలో సమర్పించడమే తరువాయి పింఛన్ మంజూరు చేసేవారు. కాని ఇప్పుడా పరిస్థితి లేదు. భర్తలు చనిపోయి ఏడాదవుతున్నా ఇంకా పింఛన్లు మంజూరు కాక పదుల సంఖ్యలో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అలాగే వృద్ధులు కూడా పింఛన్లు మంజూరు కాక అల్లాడుతున్నారు. కనీసం మందుల ఖర్చుకైనా పింఛన్ డబ్బులు పనికొస్తాయని ఆశిస్తుంటే.. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాజకీయ పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరయ్యేవి. తాజా పరిస్థితి చూస్తుంటే సంక్షేమ పథకాల మాట దేముడెరుగు.. కనీసం సామాజిక పింఛన్లు అయినా మంజూరు చేస్తే చాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సుమారు మూడు వేల మంది..

నెల్లిమర్ల నియోజకవర్గంలో కొత్త పింఛన్ల కోసం సుమారు 3 వేల మంది అర్హులు ఎదురుచూస్తున్నారు. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలలో ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ వందలాది మంది ప్రదక్షణలు చేస్తున్నారు. పూసపాటిరేగ గ్రామానికి చెందిన పిల్ల బుచ్చమ్మ అనే మహిళ భర్త చనిపోయి ఏడాదవుతోంది. పింఛన్ మంజూరు కోసం కనబడిన ప్రతి ఒక్కరినీ వేడుకుంటున్నా ఇంతవరకు మంజూరు కాలేదు. అలాగే కుమిలి గ్రామంలో కోంద్ర లక్ష్మి, ఉప్పాడ అసిరమ్మ, బూర్లె అప్పయ్యమ్మ, పాట్నూరు రమణమ్మ, తదితరులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇలా అర్హత ఉన్న ఎంతోమంది ప్రభుత్వం ఎప్పుడు కనికరిస్తుందా అని బతుకు బండి లాగిస్తున్నారు.

ఓపెన్ కాని వెబ్‌సైట్..

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్తే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదనే సమాధానం వినిపిస్తోంది. గతంలో 365 రోజులూ వెబ్‌సైట్ ఓపెన్‌లో ఉండగా ప్రతిరోజూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కాని ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఓవైపు కొత్త పింఛన్లు మంజూరు చేయకుండానే.. మరోవైపు ఉన్న పింఛన్లు ఊడదీయడానికి గ్రామాలలో సర్వేలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అర్హులకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. దరఖాస్తులు సచివాలయంలో ఇచ్చినట్లయితే పేర్లు నమోదు చేస్తాం. పాత పింఛన్ల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత కొత్త పింఛన్లకు అవకాశం ఉంటుంది.

ఎం. రాధిక , ఎంపీడీఓ పూసపాటిరేగ

హెచ్ఐవీ నియంత్రణకు కృషి చేయాలి



మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

- డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ ఎస్. జీవనరాణి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ వాహనం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి అధికంగా ఉన్న గ్రామాల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ నూక సాక్షి గోపాలరావు, డీపీహెచ్ఎన్ఓ మామిడి సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మంచి జీవనశైలితో ఆరోగ్యం



డెంకాడలో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

- సీడీపీఓ సత్యవతి

డెంకాడ: మంచి జీవనశైలితో ఆరోగ్యంగా ఉండవచ్చని భోగాపురం సెక్టార్ ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.సత్యవతి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భధారణ మొదలుకుని బిడ్డకు రెండు సంవత్సరాలు వయసు వరకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎలాంటి ఆహారంలో ఎలాంటి పోషకాలు ఉంటాయో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారులు తమంతట తాముగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎ.సత్యవతి, పి.శైలజారాణి, కార్యకర్తలు లక్ష్మి, సత్యవతి, ఆయాలు, వైద్య సిబ్బంది, తల్లులు, ట్రైనీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: మండలంలోని మోదవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోపాడ, జగన్నాథపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీవీజీ, గురజాడ స్ఫూర్తి ప్రదాతలు..



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం: డాక్టర్ పీవీజీ రాజు, గురజాడ అప్పారావు స్ఫూర్తిప్రదాతలని విజయనగరం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీఎస్‌ఏ రాజు అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ ఆధ్వర్యంలో కళాశాలలో కళాశాల విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమితి ఆధ్వర్యంలో డాక్టర్ పీవీజీ రాజు, గురజాడ అప్పారావు జీవిత విశేషాలపై తమ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కాగు పాటి నారాయణమూర్తి, సలహాదారు సుభద్రాదేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కేఎస్‌పీ మూర్తి, కె హరికృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి

నెల్లిమర్ల: ఏప్రిల్ 30వ తేదీలోగా 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు ఈ ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించాలని కోరారు. నగర పంచాయతీ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్లు, పురమిత్ర యాప్‌లో కూడా పన్ను చెల్లించవచ్చని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



ఇన్‌చార్జ్ ఏఓ కె.హరికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు కె.గురుమూర్తి, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రాలు సమర్పిస్తున్నామని వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు కె. గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏఓ కె. హరికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల తరబడి విధులు నిర్వహిస్తున్నా కనీస వేతనాలు లేవన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ. 10,500తో కుటుంబాన్ని ఎలా నెట్టుకు రాగలమని ప్రశ్నించారు. కనీస వేతనం రూ. 26000 ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు, సీనియర్ నాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



మార్వాడి యువమంచ్ నూతన కార్యవర్గం

విజయనగరం: పేదల అవసరాన్ని గుర్తించి సేవలు అందించినప్పుడే స్వచ్ఛంద సంస్థలకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని రోటరీ క్లబ్ పూర్వపు గవర్నర్ ఆర్‌కే జైన్ అన్నారు. పట్టణంలోని తోష్నీవాలా కల్యాణ మండపంలో మార్వాడి యువమంచ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మార్వాడి యువమంచ్‌కు చెందిన యువత సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ 2025 సంవత్సరం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం హర్షణీయమన్నారు. మూగజీవాలకు సేవలు చేయడంతో పాటు వేసవిలో చలివేంద్రాలు, విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలనుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. అంతకుముందు మార్వాడి యువమంచ్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన అభిషేక్ శర్మ, కార్యదర్శి అటల్ దండ్, కోశాధికారి అర్పిత జైన్, ప్రతినిధులు అశోక్ పురోహితు, రోహిత్ సోనీ, సంజీవ్ అగర్వాల్, తరుణ్ జవహర్ , భరత్ కొఠారి, కమల్‌శర్మ, జోన్ 4 ఉపాధ్యక్షుడు అభిషేక్ చౌదరి, జాయింట్ సెక్రెటరీ ఉమేష్ అగర్వాల్, తదితరులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మేఘరాజ్ రాఠి, వీవీ రాజేష్, ఆర్. శంకర్‌రెడ్డి, ప్రవీణ్ అంచాలియా, నిర్మల్ జైన్, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ గోదాం తనిఖీ



భోగాపురం మండల కేంద్రంలోని సివిల్ సప్లైస్ గోదాంను (ఎంఎల్ఎస్ పాయింట్) జాయింట్ కలెక్టర్ సేతుమాధన్ బుధవారం తనిఖీ చేశారు. గోదాంలో అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలు, సరుకుల నాణ్యత, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంసీఎస్ మీనకుమారి, హెచ్‌డీటీ సుభాష్, సీఎస్‌డీటీ మురళీకృష్ణ, గోదాం ఇన్‌చార్జి స్వర్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

– భోగాపురం

సన్మార్గంలో నడుచుకోవాలి



సతివాడ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

- ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు సన్మార్గంలో నడుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్సై గణేష్ సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో సంకల్ప రథం ద్వారా మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో ఎన్నో అనర్థాలు కలుగుతాయని చెప్పారు. చిన్న వయసులోనే మత్తుకు అలవాటు పడి ఎంతోమంది తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం గంటస్తంభం: ఎన్నికల హామీలో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల హామీ నెరవేర్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేపట్టిన పోరుబాట కార్యక్రమం రెండో రోజైన బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జగనన్న కాలనీలో సెంటున్నర స్థలం ఇస్తే ఎందుకూ సరిపోదని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు సరిపడా స్థలాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అలాగే 1.80 లక్షల ఆర్థిక సాయం ఇంటి నిర్మాణానికి సరిపోదని చెప్పారని, ఇప్పుడెందుకు రూ. 5 లక్షల సాయం చేయడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసేవరకూ సీపీఐ పేదల పక్షాలన పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.రంగరాజు, పొందూరు అప్పలరాజు, బూర వాసు, వద్దాది కొండలరావు, సూరీడమ్మ, ఏఐటీయూసీ నాయకులు అల్తి మారయ్య, జలగడుగుల కామేష్, తదితరులు హాజరయ్యారు.

చేపల చెరువుల వేలంపై డీఎల్‌పీఓ విచారణ



వల్లూరు సచివాలయంలో విచారణ చేపడుతున్న డీఎల్‌పీఓ మోహనరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరులో ప్రభుత్వ అనుమతుల్లేకుండా చేపల చెరువుల వేలం వేయడంపై అందిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ మోహనరావు బుధవారం విచారణ చేపట్టారు. వల్లూరు రెవెన్యూ పరిధిలో మత్స్యకార సొసైటీ ఉన్నప్పటికీ చేపల చెరువులను అక్రమంగా వేలం వేస్తూ, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారంటూ ఇటీవల నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో గ్రామానికి చెందిన అప్పన్న ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామ సచివాలయంలో డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు అప్పన్నతో మాట్లాడి వివరాలు సేకరించారు. మత్స్యకార సొసైటీ ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నామని, పూర్తి స్థాయిలో ఇంకా విచారణ చేపట్టాల్సి ఉందని డీఎల్‌పీఓ మోహనరావు తెలిపారు. చెరువుల వేలానికి పంచాయతీ తీర్మానం సరిపోదని, సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ శంకరజగన్నాథ్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



లక్కవరపుకోట: చందులూరులో రైతులకు నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

లక్కవరపుకోట: నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏడీఏ ఎల్.విజయ అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగుపై చందులూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, జీవ వైవిధ్యం పెరుగుతుందని, ప్రధాన పంటలకు అన్ని పోషకాలు అందుతాయని, ఎరువుల వినియోగం తగ్గుతుందని చెప్పారు. అంతర పంటలుగా వీటిని సాగుచేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. తొలకరి నువ్వుల పంటల సాగు చేయాలనుకునే రైతులు నువ్వులతో పాటు నవధాన్యాల విత్తనాలను కలిపి చల్లాలని సూచించారు. పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు అవసరమైన ఏడు రకాల విత్తనాలతో తయారు చేసిన కిట్లను రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, ఒక కిట్‌ను రైతులకు రూ.100కు అందిస్తున్నామని తెలిపారు. చందులూరు యూనిట్‌లో 1,100 ఎకరాలు, లింగంపేట యూనిట్‌లో 820 ఎకరాల్లో నవధాన్యాల సాగుకు అవసరమైన కిట్లు అందజేయనున్నామని తెలిపారు. అలాగే ఖరీఫ్ వరి సాగుకు ముందు 18 రకాల నవధాన్యాల విత్తనాలను పొలాల్లో చల్లుకోవాలని, 12 కిలోల చొప్పున ఒక కిట్‌గా తయారు చేసి రూ.800లకు అందించనున్నట్లు వివరించారు. ఏఓ స్వాతికుమారి, వీఏఏలు సురేష్,మోహన్,తేజ ,అప్పారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్,రమేష్ పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూమి సారవంతం

వేపాడ: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)ఆనందరావు అన్నారు. కొండగంగుబూడి, పాటూరు యూనిట్‌ల లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారుచేసిన నవధాన్యాల విత్తనాల కిట్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగుకు ముందు నవధా న్యాలను సాగు చేసి చేనును కలియ దున్నాలని చెప్పారు. ఎకరానికి 12 కిలోల నవధా న్యాలు చల్లాలని సూచించా రు. సుస్థిర వ్యవసాయ కేంద్రం కో–ఆర్డినేట్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.